సాక్షి అనకాపల్లి

శుక్రవారం ; 13 ; జూన్ ; 2025



వేటకు వేళాయె 8లో

ఉష్ణోగ్రతలు

గురువారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	31.3/25.2
చోడవరం	37.0/26.0



కొత్తగా కళ్లు తెరిచెనే.! 8లో

సీఆర్ఎంటీలకు కలవరం

- వీరిని బోధన నుంచి దూరం చేస్తున్న విద్యాశాఖ
- 2012 నుంచి సేవలందిస్తున్న రిజర్వ్ మొబైల్ టీచర్లు
- క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్స్ విధానాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



ఉపాధ్యాయులు లేని చోట విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న సీఆర్ఎంటీ (ఫైల్)

నర్సీపట్నం: రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లకు (సీఆర్ఎంటీలు) శాపంగా మారాయి. బదిలీలు, ప్రమోషన్లు చేయగా మిగిలిన ఉపాధ్యాయులను క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్లుగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుండడంతో సీఆర్ఎంటీలు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం సీఆర్ఎంటీల సేవలకు పెద్దపీట వేసింది. 2012 నుంచి విధులు నిర్వర్తిస్తున్న వీరి సేవలను బోధనకు ఉపయోగించుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో నెంబరు 65 ద్వారా క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ జీవో ప్రకారం సీఆర్పీ విధానం రద్దయి సీఆర్ఎంటీ విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. అలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న 260మంది సీఆర్ఎంటీలు టీచర్లు సెలవు పెడితే విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. వీరు విద్యాశాఖలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వ సీఆర్ఎంటీలను ఇంటికి సాగనంపేందుకు పూనుకుందని, అందుకే బదిలీలు జరగగా మిగిలిన ఉపాధ్యాయులను తమ స్థానంలో నియమించేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోందని సీఆర్ఎంటీలు ఆందోళన చెందుతున్నారు. తమ సేవలను మరింత వినియోగించుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి..



ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. మా సేవలను మరింత వినియోగించుకోవాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వ తీసుకొచ్చిన క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని, రాష్ట్రంలో పనిచేస్తున్న 3,300 మంది సీఆర్ఎంటీలకు తగు న్యాయం చేయాలి

–పూడి వెంకట్రావు, ఏపీ సీఆర్ఎంటీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



నర్సీపట్టణం రామారావుపేట జెడ్పీ హైస్కూల్‌లో అరకొరగా హాజరైన విద్యార్థులు



అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీరు

బడిలో సమస్యల గంట

తెరుచుకున్న పాఠశాలలు..అసౌకర్యాలతో స్వాగతం

- పాఠ్య పుస్తకాలతో సరి
- అరకొరగా స్టూడెంట్ కిట్‌ల పంపిణీ
- తొలి రోజు మూడొంతులు తగ్గిన విద్యార్థుల హాజరు శాతం
- విద్యార్థుల కోసం తల్లికి వందనం పేరిట హడావుడి



శివపురం జెడ్పీహైస్కూల్‌లో పంపిణీ కాని పుస్తకాలు

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ గురువారం తెరుచుకొన్నాయి. ప్రారంభం రోజునే విద్యార్థులకు కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అసౌకర్యాలు స్వాగతం పలికాయి. విద్యార్థుల నమోదు శాతం గణనీయంగా తగ్గింది. మూడొంతుల హాజరు శాతం తగ్గుముఖం పట్టింది. కొత్త విద్యార్థుల చేరిక అరకొరగానే జరిగింది. 'తల్లికి వందనం' ఇచ్చేస్తున్నామని కూటమి ప్రభుత్వం హడావుడి చేసి విద్యార్థులను పాఠశాలలకు రప్పించే ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం ఇవ్వలేదు. పాఠశాల ప్రారంభమైన తొలి రోజు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు గణనీయంగా తగ్గిపోవడంతో విద్యార్థులు మళ్లీ ప్రైవేట్ స్కూళ్ల వైపు మరలుతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. అసౌకర్యాలు నిండిన ప్రభుత్వ పాఠశాలల్లో రెక్కలు విరిగిపోయిన ఫ్యాన్లు, పాఠశాల ఆవరణలో బురద, నిల్వ ఉన్న వర్షం నీరుతో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి.



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఒకే గదిలో కూర్చున్న అన్ని తరగతుల విద్యార్థినులు

అరకొరగా స్టూడెంట్ కిట్లు...

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తొలి రోజు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. గాజువాకలో గల బుక్ డిపో నుంచి అనకాపల్లి జిల్లాలోగల వివిధ ప్రభుత్వ పాఠశాలలకు తరలించారు. జిల్లాలో మొత్తం 5,13,887 పుస్తకాలు అవసరం ఉంది. వంద శాతం 5,13,887 పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. అయితే స్టూడెంట్ కిట్‌లో యూనిఫాం, బ్యాగ్‌లు సగం మాత్రమే వచ్చాయి. వచ్చిన సగం కూడా ఎవరికీ ఇవ్వలేదు. టై, బెల్టు, షూ రానేలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచిన రోజునే జగనన్న విద్యాకానుక (స్టూడెంట్ కిట్) ద్వారా విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, షూ తదితర సామగ్రి అందజేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నుంచి గతేడాది అరకొరగానే కిట్లు పంపిణీ చేసినా..ఈ ఏడాదైనా పూర్తిస్థాయిలో ఇస్తారేమో అని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశ నిరాశగానే మిగిలిపోయింది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా ఒక్కో విద్యార్థికి అమ్మ ఒడి పథకం కింద రూ. 15 వేలు నగదు అందేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత తల్లికి వందనం ఎంత మంది విద్యార్థులుంటే అంత మందికి ఏడాదికి రూ. 15 వేలు అందిస్తామన్నా గత ఏడాది ఒక్కరికీ ఇవ్వలేదు.

అసంపూర్తిగా తరగతులు, టాయిలెట్ల నిర్మాణాలు

కొన్ని స్కూళ్లలో తరగతి భవనాలు, టాయిలెట్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి దర్శనమిచ్చాయి. మరికొన్ని చోట్ల స్కూళ్ల ఆవరణలో ఆటస్థలాల్లో తుప్పలు, చెత్త చెదారం పేరుకుపోయాయి. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి ఎస్జీటీ కౌన్సెలింగ్‌లో మూడు రోజులుగా బిజిబిజీగా ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ప్రజా ప్రతినిధులు వరకూ యోగా వేడుకల్లో ఉండడంతో తొలిరోజు స్కూళ్లు మొక్కుబడిగా నడిచాయి. మాడుగుల మండలంలో ఎం.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఒకే ఒక్క విద్యార్థి కొత్తగా చేరారు.

తొలి రోజు 39 శాతం హాజరు..

- పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి మండలంలో 7,584 మంది విద్యార్థులకు గానూ 1936 మంది హాజరయ్యారు. ఎస్.రాయవరం మండలంలో 7704 మంది విద్యార్థులకు 2767 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాయకరావుపేట మండలంలో 4562 మంది విద్యార్థులకు 1070 మంది హాజరయ్యారు.
- చోడవరం నియోజకవర్గం బుచ్చెయ్యపేట మండలంలో 3,714 మంది విద్యార్థులకు 1308 మంది, రోలుగుంట మండల పరిధిలో 2387 మంది విద్యార్థులకు 1910 మంది, అలాగే చోడవరం మండల పరిధిలో 4542 మంది విద్యార్థులు, రావికమతం మండల పరిధిలో 5230 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండల పరిధిలో గల ప్రభుత్వ స్కూళ్లలో 5184 మంది విద్యార్థులకు 4092 మంది హాజరయ్యారు
- యలమంచిలి మండల పరిధిలో 3,916 మందికి 2,867 మంది, రాంబిల్లి మండల పరిధిలో సుమారుగా 2,300 మంది, అచ్యుతాపురం మండల పరిధిలో 4,000 మంది హాజరయ్యారు.
- నర్సీపట్నం నియోజకవర్గంలో మాకవరపాలెం మండలంలో 2904 మంది విద్యార్థులకు 2576 మంది, నర్సీపట్నం మండల రూరల్, టౌన్ పరిధిలో 19 వేల మందికి 1700 మంది, గొలుగొండ మండల పరిధిలో 4024 మందికి 1100 మంది విద్యార్థులు, నాతవరం 4,900 మంది విద్యార్థులకు 2,500 మంది వరకూ హాజరయ్యారు.
- అనకాపల్లి నియోజకవర్గంలో అనకాపల్లి మండల రూరల్, టౌన్ పరిధిలో 9 వేల మంది విద్యార్థులకు 5 వేల మంది, కశింకోట మండల పరిధిలో 3800 మందికి 1400 మంది హాజరయ్యారు.
- మాడుగుల నియోజకవర్గం మాడుగుల మండల పరిధిలో 5,212 మందికి 4,800 మంది, దేవరాపల్లి మండలం 4,308మందికి 3,366, కె.కోటపాడు మండల పరిధిలో 2343 మందికి 1205 మంది విద్యార్థులు హాజరవగా, చీడికాడ మండల పరిధిలో 1525 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- సబ్బవరం మండలంలో 2,556 మందికి, 1989, పరవాడ మండలంలో 3,466 మందికి 1075 మంది హాజరయ్యారు.

కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టండి

డీఈవో కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నేతల ఫిర్యాదు



ఫిర్యాదు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్/అనకాపల్లి: జిల్లాలో వివిధ కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ డిమాండ్ చేశారు. గురువారం యలమంచిలి కోర్టుపేటలోని కార్పొరేట్ పాఠశాలలో ప్రత్యేక కౌంటర్ ద్వారా చేపడుతున్న పుస్తకాల విక్రయాన్ని ఎస్ఎఫ్ఐ నేతలు పరిశీలించి, నిర్వాహకులను ప్రశ్నించారు. అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తూ, విద్యా సంస్థ పేరును పుస్తకాలు, క్యారీ బ్యాగులపై ముద్రించారని, అన్ని నిబంధనలు అతిక్రమిస్తున్నా జిల్లా విద్య, వాణిజ్య పన్నుల శాఖాధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అధిక ఫీజులను వసూలు చేయడంతోపాటు, పుస్తకాలు, యూనిఫాం, ఇతర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మణికంఠ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉలికిపాటు

- ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనతో కలకలం
- గత ప్రమాదాల నుంచి నేర్చుకోని యాజమాన్యం
- ప్రభుత్వ ఉదాసీనతే కారణమన్న ఆరోపణలు

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో ఫార్మా ఉద్యోగులు, కార్మికులు ఉలికి పడుతున్నారు. తరచూ ఫార్మా పరిశ్రమల్లో చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీక్ ఘటనలతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో సాల్వెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో గురువారం తెల్లవారు జామున జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనలో పరిశ్రమలో సేఫ్టీ మేనేజర్‌గా పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన పరిమి చంద్రశేఖర్(32), షిఫ్ట్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన శరగడం కుమార్(25) మృత్యువాత పడ్డారు. హెల్పర్‌గా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన బైడు బైసాల్(37) ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వరుస ప్రమాదాలతో భయాందోళన

- గతంలో సినర్జీస్ యాక్టివ్ పరిశ్రమలో జరిగిన బాయిలర్ పేలుడు ఘటనలో జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు, ఒడిశాకు చెందిన ఒకరు, విజయనగరానికి ఒకరు ప్రాణాలు కోల్పోయారు.
- రక్షిత్ డ్రగ్స్ ఫార్మాలో గత డిసెంబర్‌లో ప్రొడక్షన్ బ్లాక్‌లో హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్ లీకైన ఘటనలో కాంట్రాక్టు కార్మికులు దేవిబాగ్, ఉగ్రేసర్‌గాడ్‌లు అస్వస్థతకు గురయ్యారు.
- గత ఏప్రిల్‌లో అపిటోరియా పరిశ్రమ యూనిట్–6లో నైట్రోజన్ గ్యాస్ పీల్చడంతో విజయనగరం జిల్లా గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఆళ్ల గోవింద్ మృతి చెందాడు.
- ఆల్కలీ మెటల్ ఫార్మా పరిశ్రమలో ఏప్రిల్‌లో జరిగిన మరో ఘటనలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకై విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గొల్లపేటకు చెందిన సీహెచ్ రమణ(32) మృతి చెందాడు. మరో నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.
- అదే నెలలో ఠాగూర్ లేబొరేటరీస్ పరిశ్రమలో రియాక్టర్‌ను శుభ్రం చేస్తున్న క్రమంలో రియాక్టర్ వాల్వ్ నుంచి విడుదలైన విష వాయువును పీల్చడం వల్ల కె.సింహాచలం అనే కాంట్రాక్టు కార్మికుడు అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- మెట్రికెమ్ పరిశ్రమలో ఖాళీ రసాయన డబ్బాలు, వ్యర్థాల వల్ల ప్రమాదం నెలకొంది. యాజమాన్యం వెంటనే స్పందించడంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.



ఎస్ఎస్ ఫార్మాలో గ్యాస్ లీకైన ప్రదేశం



ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు చెరో రూ.55 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, సీఐ ఆర్.మల్లికార్జునరావు సమక్షంలో బాధిత కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు నష్టపరిహారం చెక్కులను అందించారు.

సన్నబియ్యంతో 'మధ్యాహ్న భోజనం'

కలెక్టర్ విజయ కృష్ణన్



తుమ్మపాల: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం గురువారం నుంచి ప్రారంభమైందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. సన్న బియ్యంతో మరింత నాణ్యంగా భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన సన్న బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థ మండల స్థాయి గోదాముల నుండి పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,418 ప్రభుత్వ పాఠశాలలు, 136 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు కలిపి 16,898 నాణ్యమైన సన్న బియ్యం సంచులను (25 కేజీల) చొప్పున పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎటువంటి అక్రమాలు జరగకుండా ప్రతి బస్తాకు క్యూ ఆర్ కోడ్ ముద్రించడం జరిగిందని తెలిపారు.

ఇది హృదయ విదారక ఘటన

విమాన ప్రమాద మృతులకు మాజీ మంత్రి అమర్‌నాథ్ సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చిత్రంలో విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

సాక్షి, విశాఖపట్నం: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన చాలా దురదృష్టకరమని.. ఇది తమను ఎంతో బాధించిందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నేతలు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబీకుల దుఃఖాన్ని ఊహించడం కష్టమని.. అందరికీ తట్టుకునే బలాన్ని, ధైర్యం ఇవ్వాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, ముఖ్య నేతలు పేర్ల విజయచందర్, రవిరెడ్డి, బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, పీతల గోవింద్ తదితరులు సంతాపం తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమివ్వాలి

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



కేజీహెచ్ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

మహారాణిపేట: పరవాడలోని జేఎన్ ఫార్మాసిటీలో ఉన్న ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటనలో మృతి చెందిన పరిమి చంద్రశేఖర్(తెలంగాణ), శరగడం కుమార్(మునగపాక) కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎసెన్షియా ఫార్మా తదితర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో చాలా మంది మరణించారని పేర్కొన్నారు. కంపెనీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని తెలిపా రు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఏడాది కాలంలో ఇన్ని ప్రమాదాలు ఎప్పుడూ జరగలేదన్నారు. గతంలో జరిగిన ప్రమాదంలో ఎలా నష్ట పరిహారం ఇచ్చారో అలాగే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోస్ట్‌మార్టం పూర్తి

ఎస్ఎస్ ఫార్మా గ్యాస్ లీక్ ఘటన మృతదేహాలకు కేజీహెచ్‌లో పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గాయపడిన హెల్పర్ బైడూ బైసాల్‌కు మెరుగైన వైద్యం అందించి, పరిహారం ప్రకటించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు, కుటుంబ సభ్యుల మధ్య చర్చలు జరిగాయి. నష్టపరిహారానికి హామీ ఇవ్వడంతో పోస్ట్‌మార్టం ప్రారంభించారు. సాయంత్రానికి రెండు మృత దేహాలకు బంధువులకు అప్పగించారు.

మునగపాకలో తీరని విషాదం



ఫార్మా ప్రమాదంలో మృతి చెంది కుమార్

మునగపాక: కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకున్న కుమారుడు ఫార్మా ప్రమాదంలో మృతి చెందడంతో మునగపాకలో విషాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మధ్య వీధిలో నివాసం ఉంటున్న శరగడం కుమార్(25)కు గత సంవత్సర క్రితం వివాహం జరిగింది. కుమార్ 8 నెలల క్రితం పరవాడలోని ఎస్ఎస్ ఫార్మాలో సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ వచ్చాడు. ఈ నెల 11న రాత్రి విధి నిర్వహణలో ఉండగా వెలువడిన విష వాయువులను పీల్చడంతో కుమార్ అస్వస్థతకు గురవడంతో వెంటనే అతనిని విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునగపాక గ్రామంలో విషాదం నెలకొంది. కుమార్ తండ్రి రామకృష్ణ గత 7 సంవత్సరాల క్రితం మృతి చెందగా తల్లి లక్ష్మి నాలుగు నెలల క్రితం చనిపోయింది. కుమార్ తమ్ముడు సౌత్ ఆఫ్రికాలో ఉద్యోగం చేస్తున్నాడు. భర్త కుమార్ మృతి చెందాడన్న విషయం తెలియడంతో భార్య మాధురి కన్నీటిపర్యంతమైంది. ఎంతో భవిష్యత్ ఉన్న కుమార్ ఫార్మా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు ఎవరంటూ ఆవేదన చెందుతున్నారు. అందరితో సఖ్యతగా ఉండే కుమార్ ఫార్మా ప్రమాదంలో మృతి చెందడాన్ని స్థానికులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉండగా మృతుడు కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కంపెనీ యాజమాన్యంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్ తదితరులు చర్చలు జరిపారు. కుమార్ అంత్యక్రియలు శనివారం మునగపాకలో నిర్వహించనున్నారు.



మృతుడు కుమార్ ఇంటి వద్ద విషాద వదనంలో బంధువులు

అనకాపల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా గౌరీ

అనకాపల్లి: ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా వెళ్లడం జరిగింది. ప్రస్తుతం ఇక్కడ ఈ పోస్టు ఖాళీగా ఉంది. ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ) అనకాపల్లి డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రవిచంద్ర విజయవాడ ప్రజా రవాణాశాఖ ప్రధాన కార్యాలయానికి (ఆపరేషన్ విభాగంలో) బదిలీపై వెళ్లారు. ఇక్కడకు విశాఖ వాల్తేరు డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరి ఈనెల 16న బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు ఆమె చెప్పారు.

గోవాడ సుగర్స్ ఎండీగా వెంకటేశ్వరరావు



చోడవరం: గోవాడ సహకార చక్కెర కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏటి కొప్పాక ఎండీగా పనిచేస్తున్న ఆయనను తాజాగా ప్రభుత్వం గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి బదిలీ చేసింది. ఇక్కడ ఎండీగా పని చేసిన వి.వి. సన్యాసిరావును భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి బదిలీ చేశారు.

కొత్తగా కళ్లు తెరిచెనే.!


రెడ్‌నెక్డ్ వాల్లబీ సంచిలో వేలాడుతున్న పిల్ల

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో రెండు జంతువుల పిల్లలు సందడి చేస్తున్నాయి. ఇటీవల గర్భం దాల్చిన రెడ్-నెక్డ్ వాలబీ, మౌస్ డీర్ ఒక్కో పిల్లకు జన్మనిచ్చాయి. ప్రస్తుతం తల్లీపిల్లలు రెండూ ఆరోగ్యంగా ఉన్నాయి. మౌస్ డీర్ పిల్ల తన తల్లితో కలిసి ఎన్‌క్లోజర్‌లో చురుకుగా తిరుగుతూ సందర్శకులకు కనువిందు చేస్తోంది. మరోవైపు రెడ్-నెక్డ్ వాలబీ పిల్ల ఇంకా తన తల్లి పొట్టభాగంలోని సంచిలోనే సురక్షితంగా ఉంది. సాధారణంగా రెడ్-నెక్డ్ వాలబీ గర్భం దాల్చిన 30 రోజుల్లోనే పిల్లకు జన్మనిస్తుంది. పుట్టినప్పటి నుంచి ఆ పిల్ల సుమారు ఏడు నెలల పాటు తల్లి సంచిలోనే ఉండి పాలు తాగుతూ పెరుగుతుంది. దాదాపు 12 నెలల వయసు వచ్చాక పూర్తిగా బయటకు వచ్చి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తుంది. ఈ రెండు పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయని జూ క్యూరేటర్ మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జూలో జంతువుల పునరుత్పత్తి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, కొన్ని నెలల కిందట కూడా పలు జంతువులు పిల్లలకు జన్మనిచ్చాయని ఆమె పేర్కొన్నారు. జూ సంరక్షకులు వాటికి నిరంతరం ప్రత్యేక సేవలు అందిస్తున్నారని వివరించారు.

'సాక్షి' విలేకరి హఠాన్మరణం


బి.రామకృష్ణ (ఫైల్)

గాజువాక: 'సాక్షి'అక్కిరెడ్డిపాలెం విలేకరి బి.రామకృష్ణ హఠాన్మరణం చెందారు. దీంతో 'సాక్షి'సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. గురువారం విధులను ముగించుకుని కంచరపాలెంలోని తన సోదరి ఇంటికి వెళ్లిన రామకృష్ణ గుండెపోటుకు గురయ్యారని సమీప బంధువులు తెలిపారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. 'సాక్షి'దినపత్రికలో అక్కిరెడ్డిపాలెం విలేకరిగా రామకృష్ణ పదేళ్లుగా పని చేస్తున్నారు. నిరంతరం ఆయన ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చే కథనాలను అందించారు. ఆయన మృతికి 'సాక్షి'సిబ్బంది, సహచర విలేకరులు సంతాపం ప్రకటించారు.

వేటకు వేళాయెె

- రేపు అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేట
- బోట్లను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు


బోట్లలో ఐస్ నింపుకొని సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

మహారాణిపేట: మత్స్యకారులు వేటకు సిద్ధమవుతున్నారు. హార్బర్ మళ్లీ కళకళలాడనుంది. రాష్ట్ర ప్రభుత్వం విధించిన వేట నిషేధం గడువు శనివారంతో ముగియనుంది. శనివారం అర్ధరాత్రి నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ బోసిపోయిన విశాఖ ఫిషింగ్ హార్బర్ మళ్లీ సందడిగా మారనుంది. ఏప్రిల్ 15న వేట నిషేధం అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విరామ సమయంలో మత్స్యకారులు తమ పడవలకు, వలలకు మరమ్మతులు పూర్తి చేశారు. ఇంజిన్లు, గేర్ బాక్సులు, పంఖాలు వంటి కీలక భాగాలను బాగు చేయించుకుని బోట్లను వేటకు సిద్ధం చేశారు.

గంగమ్మ తల్లికి పూజలు

ప్రతి ఏటా వేట ప్రారంభానికి ముందు గంగమ్మ తల్లిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా వేటలో ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా, గంగమ్మ తల్లి చల్లగా చూడాలని కోరుకుంటూ ఈ నెల 10న హార్బర్‌లో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నట్లు రాష్ట్ర మరపడవల సంఘం మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. కాగా.. ఈ నెల 15 నుంచి మత్స్యకారులు తిరిగి వేట ప్రారంభించవచ్చని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు తెలిపారు. అయితే వేటకు వెళ్లేటప్పుడు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని, తగిన జాగ్రత్తలతో వేట సాగించాలని కోరారు.

వేటపైనే జీవనాధారం

జిల్లాలో 65 కిలోమీటర్ల తీరప్రాంతంలో ఉన్న 32 మత్స్యకార గ్రామాల్లో సుమారు 1.15 లక్షల కుటుంబాలు మత్స్యకార వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,547 మర, మోటారు, సంప్రదాయ పడవలు ఉన్నాయి. ఒక్క విశాఖ ఫిషింగ్ హార్బర్‌పైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ 61 రోజుల విరామం వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడు వేట తిరిగి ప్రారంభం కానుండటంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఏసీబీ ప్రక్షాళన

సాక్షి ఎఫెక్ట్..

- ఆరోపణలున్న సిబ్బందిపై బదిలీ వేటు?
- ఐదేళ్లు పూర్తయిన మరికొందరికి స్థానచలనం
- సాక్షి కథనాలకు స్పందన

విశాఖ సిటీ: అవినీతి నిరోధక శాఖలో ప్రక్షాళన షురూ అయింది. అవినీతి ఆరోపణలు ఉన్న సిబ్బందిపై ఎట్టకేలకు బదిలీ వేటు పడింది. దీర్ఘకాలంగా ఏసీబీలో తిష్టవేసుకుని కూర్చున్న వారికి స్థానచలనం కలిగింది. ఏసీబీలో అవినీతి సిబ్బందిపై 'సాక్షి' వరుస కథనాలతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వీరితో పాటు ఐదేళ్ల నిబంధన ప్రకారం పలువురికి బదిలీ చేస్తూ ఏసీబీ డీజీ అతుల్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ ఏసీబీలో పలువురి వ్యవహార శైలిపై మొదట్నుంచి ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. ఉన్నతాధికారుల పేరు చెప్పి పలు ప్రభుత్వ శాఖల్లో భారీగా వసూళ్లకు తెరలేపారన్న వార్తలు వినిపించాయి. ప్రధానంగా రిజిస్ట్రేషన్, రెవెన్యూ, రవాణా శాఖల నుంచి నెలసరి మామూళ్లకు అలవాటు పడ్డారన్న గుసగుసలు ఉన్నాయి. ఏసీబీలోనే దండిగా ఆదాయం వస్తుండడం కొంత మంది సిబ్బంది రాజకీయ నేతల ఆశీస్సులతో ఇక్కడి నుంచి వెళ్లకుండా తిష్టవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఒక ఎస్ఐ, ఒక హెచ్‌సీ ఏసీబీలో చక్రం తిప్పినట్లు ఆఫీస్‌లోనే చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారుల పేరుతో వీరు చేస్తున్న దందాపై 'సాక్షి' వరుస కథనాలతో అధికారులు ఉలిక్కిపడ్డారు. దీనిపై అంతర్గత విచారణ చేపట్టి అవినీతి ఆరోపణలు ఉన్న వారితో పటు ఐదేళ్ల నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టారు. వీరిలో ఎస్ఐలు బి.సురేష్, కె.శ్రీనివాసరావులను విశాఖ రేంజ్ డీఐజీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే హెచ్‌సీలు టి.కొండలరావు, ఎం.సత్యనారాయణ, ఆర్.చంద్రశేఖర్‌నాయుడు, కానిస్టేబుల్ ఎస్.రమేష్‌లను విశాఖ సీపీకి కేటాయించారు. అదే విధంగా హెచ్‌సీ జి.రాంబాబు, కానిస్టేబుళ్లు కె.రామకిరణ్, టి.శ్రీనివాసరావులను అనకాపల్లి ఎస్పీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

నిరుద్యోగ భృతి ఎక్కడ..?

- విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు?
- కూటమి పాలనలో పెరిగిపోయిన నిరుద్యోగం
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల నడ్డి విరిచిందని, తల్లికి వందనం పథకం రెండో ఏడాది కూడా అమలు చేసే పరిస్థితి కనబడడం లేదని, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో సీఎం చంద్రబాబుకే అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో గురువారం పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఏడాది అవుతున్నప్పటికీ సీఎం చంద్రబాబు ముఖం చాటేస్తున్నారని అన్నారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన నిరుద్యోగులకు జాబ్ క్యాలండర్ ఇస్తామన్న హామీ బుట్టదాఖలైందన్నారు. యువగళం పేరుతో రాష్ట్రంలో ఉన్న యువతను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ వచ్చాక జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం, నారా లోకేష్‌కు మంత్రి పదవులు వచ్చాయి తప్ప రాష్ట్రంలో నిరుద్యోగులకు దక్కింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక స్కీమ్‌లు అమలు చేస్తే కూటమి ప్రభుత్వంలో స్కామ్‌ల పాలన సాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ఉన్న ఉద్యోగాలను తీసివేయడం జరిగిందని, దీంతో నిరుద్యోగ సమస్య మరింత పెరిగిపోయిందన్నారు. ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు కూడా నేటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ మాట్లాడుతూ ఏడాది చంద్రబాబు పాలన కంటే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే ఎక్కువగా జనం మద్దతు పలుకుతున్నారని, ఇటీవల పాడిలిలో జరిగిన సభలో ప్రజాస్పందన చూస్తే అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, మండల యువజ విభాగం అధ్యక్షుడు బాదపు హరికృష్ణ, కశింకోట మండలపార్టీ అధ్యక్షుడు నీటిపల్లి దివాకర్, పార్టీ సీనియర్ నాయకులు మరిపల్లి శోభ, కోన ఉమా, శ్రీకాంత్, డానీ, దాడి నారాయణరావు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా యోగా చేయాలి

- హోం మంత్రి అనిత పిలుపు
- ఏపీఐఐసీ కార్యాలయం ఆవరణలో యోగాంధ్ర


యోగాసనం వేస్తున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు బండారు, సుందరపు, కార్మికులు, తదితరులు

అచ్యుతాపురం రూరల్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. గురువారం అచ్యుతాపురం సెజ్ ముఖ ద్వారం వద్దనున్న ఏపీఐఐసీ కార్యాలయం ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన దేశ యోగులు, రుషులు కనుగొన్న గొప్ప వ్యాయామమే యోగా అని అన్నారు. భారతదేశం ప్రపంచానికి యోగా అనే మహోన్నత వ్యాయామం బహుమతిగా ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సెజ్‌లోని పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు, యోగా ప్రేమికులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుమ్మపాల: తొలగించిన స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించి కార్మికుల సమస్యలను వివరించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ చర్చల్లో ఎట్టి పరిస్థితిలోని కాంట్రాక్ట్ కార్మికులను తొలగించమని చెప్పి నిబంధనలకు విరుద్ధంగా తొలగించడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సమ్మె చేస్తే యాజమాన్యం వేధిస్తుందని ఆరోపించారు. కార్మికులను తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.త్రినాథ్, కోరిబిల్లి శంకరరావు, సిహెచ్.రమణ, ఫణీంద్ర, సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు పడిగాపులు

కొనసాగుతున్న ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో సెకెండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌లో గురువారం 500 మందికి స్థానచలనం కలిగింది. మూడో రోజు కూడా కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. సీనియార్టీ జాబితాలో 301 నుంచి 800 వరకు ఉన్న ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జాబితాలో ఉన్న టీచర్లు ఉదయం 9 గంటలకే జిల్లా పరిషత్ సమావేశమందిరానికి చేరుకున్నారు. 10.30కు మొదలైన కౌన్సెలింగ్‌లో రాత్రి 9.30కు 700 మందికి పూర్తయింది. 701 నుంచి 800 వరకు ఉన్న టీచర్ల కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి దాటిపోయింది. శుక్రవారం 801 నుంచి 1600 వరకు ఉన్న 800 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 8.30కే కౌన్సెలింగ్ హాల్‌కు చేరుకోవాలన్నారు. ఇదిలా ఉండగా వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో కౌన్సెలింగ్‌కు హాజరైన 500 మంది ఎస్జీటీలు తొలి రోజే పాఠశాలలకు గైర్హాజరవ్వాల్సి వచ్చింది.

జలవనరుల శాఖ బదిలీల్లో అక్రమాలు?

ఉద్యోగుల ఆరోపణ

మహారాణిపేట: జలవనరుల శాఖలో మినిస్టీరియల్ సిబ్బంది బదిలీల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గురువారం పలువురు ఉద్యోగులు కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. దళితులు అన్న చిన్నచూపుతో తమకు బదిలీల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఉద్యోగులు వాపోయారు. రాజకీయ పలుకుబడి వల్ల బదిలీల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీలు ఉన్నా తనకు పోస్టింగ్ ఇవ్వడంలో ప్రాధాన్యత ఇవ్వలేదని ఉద్యోగిని హైమవతి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అవకాశం ఉన్న సీట్లలో బదిలీలు చేయలేదని, అవకాశం లేని చోట బదిలీలు చేసి ఇబ్బంది పెట్టారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు పూర్తి చేయాల్సి ఉందని.. కానీ ఇక్కడ కొంతమంది ఇష్టారాజ్యం వల్ల బదిలీలు పూర్తి చేశారన్నారు. ఉద్యోగులు పి.అప్పలరాజు, సి.హెచ్.శ్రీనివాసరావు తదితరులు కూడా బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

సీఎం విశాఖ పర్యటన రద్దు

మహారాణిపేట: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖలో సీఎం చంద్రబాబు పర్యటన రద్దయింది. శుక్రవారం ఆయన విశాఖలో పలు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది.

వేతనాల కోసం విమ్స్ వైద్యుల ధర్నా


విమ్స్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పని చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు గురువారం ధర్నా చేపట్టారు. తమ వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కాంట్రాక్ట్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విమ్స్ ఆవరణలోని అవుట్ పేషెంట్ విభాగం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ హారిక తదితర వైద్యులు మాట్లాడారు. తాము రూ. 92,000 జీతంతో కాంట్రాక్ట్ పద్ధతిలో విమ్స్‌లో చేరి మూడేళ్లు పూర్తయిందని, కానీ ఇప్పటి వరకు తమ వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం గతంలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు స్పందించలేదని వైద్యులు ఆరోపించారు. తమ వేతనాలను రూ.1.60 లక్షలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. వైద్యులు ధర్నా చేసిన రెండు గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు పడ్డారు.

విధులకు వెళ్తుండగా విధి చిన్నచూపు

- స్కూటీని ఢీకొన్న కంటైనర్
- చెల్లెలు మృతి, అన్నయ్యకు తీవ్రగాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ


గీత (ఫైల్)

కూర్మన్నపాలెం : ఆ కుటుంబంపై విధి కన్నెర్రజేసింది. గురువారం ఉదయం అన్నాచెల్లెళ్లు విధులకు స్కూటీపై వెళ్తుండగా తుంగ్లాం రైల్వే గేటుకు సమీపంలో కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో చెల్లెలు ఘటన స్థలంలో మృతి చెందగా అన్నయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. దువ్వాడ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదవ జగ్గరాజుపేటలో నివాసం ఉంటున్న గొంప శ్రీను, మణి దంపతులకు సతీష్(29), గీత(24) అనే పిల్లలు ఉన్నారు. తండ్రి శ్రీనివాస్ ఒక ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. అన్నాచెల్లెళ్లు కూడా ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం ఉదయం అన్నాచెల్లెళ్లు విధులకు స్కూటీపై వెళ్తుండగా తుంగ్లాం రైల్వేగేటు సమీపంలో కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొంది. గీత లారీ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. పక్కకు పడిపోయిన సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సతీష్‌ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అందివచ్చిన కుమార్తె మృతి చెందడం, కుమారుడు తీవ్రగాయాలపాలవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాల కార్మికుల వ్యవస్థపై అవగాహన ర్యాలీ


అనకాపల్లిలో న్యాయ శాస్త్ర విజ్ఞాన అవగాహన ర్యాలీ

అనకాపల్లి: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని అనకాపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం, న్యాయ శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ జరిపారు. ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.ధర్మారావు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాల కార్మికులు పాఠశాలలో చేరి చదువుకుని విద్యావంతులు కావాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయ శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కలిప్ించారు. జిల్లా కార్మిక శాఖ అధికారి నరేంద్ర, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో బోధన అవసరం


చిన్నారుల అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎంపీ రమేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సూర్యలక్ష్మి

అనకాపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో బోధన అవసరమని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. స్థానిక వేల్పులవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 52 మంది చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు ఆస్తిపాస్తులే కాకుండా మంచి విద్యను అందించడానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య ఆరంభ దశలో పిల్లలను తీర్చి దిద్దడంలో అంగన్‌వాడీ కార్యకర్త పాత్ర ఎంతో కీలకమైందన్నారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ ప్రీస్కూల్ కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ వరకూ జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రాథమిక విద్యను పూర్తి చేసిన 5 సంతవ్సరాల చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.ప్రభావతి, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సారథ్యంలో సుపరిపాలన

అనకాపల్లి టౌన్: బీజేపీ 11 సంవత్సరాల సుపరిపాలనలో ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం అంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. రైతు బంధు పథకం ప్రవేశపెట్టిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ సుందరీకరణకు ప్రతిపాదనలు

నర్సీపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్ సుందరీకరణకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని జిల్లా ప్రజా రవాణాధికారి కె.పద్మావతి తెలిపారు. గురువారం ఆమె ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న చిన్న మరమ్మతులు, రంగులు వేయడం కోసం ఈ ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. కొన్ని సౌకర్యాలను ఇప్పటికే మెరుగుపరిచామన్నారు. ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చామన్నారు. ఫ్యాన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కాంప్లెక్స్ లోపల మొక్కలతో అలంకరించామన్నారు. బస్సులను కాలమానం ప్రకారం తిప్పేందుకు టైమింగ్ బోర్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిపో మేనేజర్ ధీరజ్‌కు పలు సూచనలు చేశారు.

రైల్వే ఆస్పత్రిలో ఆధునిక పరికరాల ప్రారంభం


ఫిజియోథెరపీ యూనిట్‌లో అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం అధునాతన పరికరాలను డీఆర్ఎం లలిత్ బోరా గురువారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ యూనిట్‌లో ఇథైలిన్ ఆక్సైడ్ స్టెరిలైజర్, అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌లను ఆయన తోపాటు, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన పరికరాల సాయంతో రైల్వే ఉద్యోగులకు మరింత సుఖవంతమైన, శ్రేయస్కరమైన వైద్యసదుపాయాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు చేస్తున్న దేవాలయ ఉద్యోగులు

అనకాపల్లి: కరోనా తర్వాత ప్రతి ఒక్కరికీ యోగాపై ఆసక్తి పెరిగిందని, ఈ నెల 21వ ప్రపంచ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నిర్వహిస్తున్నట్లు యోగా గురువు బి.రోహిణి తెలిపారు. స్థానిక సిద్ధిలింగేశ్వరస్వామి దేవాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యోగాసనాలు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం ఉదయం, సాయంత్రం సమయంలో యోగా చేయడం వల్ల శరీరంలో అన్ని భాగాలకు రక్తప్రసరణ బాగా జరుగుతుందన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ యోగా చేయవచ్చన్నారు. వివిధ దేవాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రూ. కోటి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలో సాయి శ్రేయాస్ ఫార్మా కంపెనీలో విషవాయులు లీకై ఇద్దరు మృతి చెందిన ఘటనపై జిల్లా అధికార యంత్రాంగా తక్షణమే దర్యాప్తు చేయాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్ శంకరరావు, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మా ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు మృత్యువాతపడగా, అనేక మంది క్షతగాత్రుల య్యారన్నారు. ఇదే పరిశ్రమలో గతంలోనూ ప్రమాదం జరిగిందని, తాజాగా భద్రతా ప్రమాణాల వైఫల్యం వల్లే ఘటన చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. భద్రత చర్యలు చేపట్టే వారే మృత్యువాత గురికావడం మరింత ఆందోళనకు గురి చేస్తుందన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు వెంటనే జోక్యం చేసుకొని ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ ప్రమాదాలతో కార్మికుల్లో మరింత భయాందోళన నెలకొందన్నారు. దీనికి భద్రతా చర్యలు ఒకటే మార్గమని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

15న భారీ బైక్ ర్యాలీ

అనకాపల్లి టౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి ద్వరామి నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో 22 యోగా శిక్షణా కేంద్రాల ప్రముఖులతోపాటు జార్జి క్లబ్ నుంచి రింగ్‌రోడ్ వరకు ఐదు వేల మందితో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా ట్రైనర్లు పాలమరెట్టి సత్యనారాయణ, జి. సంతోషి, గోవర్ధిని, జార్జ్ క్లబ్ కోచ్ ఎంఎస్ఎన్ అప్పారావు, దాడి బుజ్జి, టి. మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 130 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,500	4,160
రెండో రకం	3,940	3,440
మూడోరకం	2,850	2,930

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -6, ఓ పాజిటివ్ -20, ఏబీ పాజిటివ్ -5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 345 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మొక్కుబడిగా..

- తొలి రోజు అరకొరగా విద్యార్థుల హాజరు
- తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రతతో సరి
- పూర్తిస్థాయిలో అందని విద్యా మిత్ర కిట్లు



కశింకోటలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



పాఠశాలకు ఉత్సాహంగా వస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి: వేసవి సెలవులు ముగించుకుని బాడిబాట పట్టిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని పాఠశాలల్లో వర్షపు నీరు తరగతి గదుల్లోకి చేరుకుంది. పాఠశాలల ఆవరణ బురదమయంగా దర్శనమిచ్చింది. అయితే గురువారం నుంచి పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలల్లో అంతా సందడి నెలకొంది. అనకాపల్లి పట్టణంతోపాటు మండలంలో మొదటి రోజు ఐదు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. చాలా మంది తొలిరోజు పాఠశాలలకు హాజరు కాలేదు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు రాలేదు. ఈ కిట్లలో మూడు జతల యూనిఫాం, రెండు జతల సాక్సులు, ఒక జత బూట్లు, స్కూలు బ్యాగు, బెల్టు ఉండాలి. ప్రస్తుతానికి పాఠ్యపుస్తకాలు మాత్రమే వచ్చాయని ఉపాధ్యాయులు చెప్పారు. నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్ రాలేదన్నారు. వారం రోజులు తర్వాత మిగిలిన సామగ్రి ఇస్తామని చెప్పారు. అయితే పాఠశాలలు పునః ప్రారంభం నాటికే విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యా మిత్ర కిట్లు సిద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా తొలి రోజు ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవు. కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు స్కూలు బ్యాగ్, షూస్, యూనిఫారం ఇవ్వలేదు. కొన్ని స్కూళ్లలో పాఠ్య, నోట్ పుస్తకాలు సరఫరా చేసినప్పటికీ మరికొన్ని స్కూళ్లలో మాత్రం ఇవ్వలేదు. మొదటి రోజు విద్యార్థులు తక్కువగా హాజరయ్యారు. మొత్తం విద్యార్థులు వచ్చినప్పుడు ఒకేసారి ఇవ్వాలని పుస్తకాలు పంపిణీ చేయలేదని, పాఠశాలకు సరిపడిన మేరకు ఇప్పటికే చేరాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, వెదురుపర్తి, బయ్యవరం, తదితర పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ చేశారు. మిగిలిన పాఠశాలల్లో ఇంకా పంపిణీ చేయాల్సి ఉంది. స్కూలు యూనిఫాం, బ్యాగ్, షూస్ ఇంకా పంపిణీ చేయక పోవడంతో విద్యార్థులు నిరాశ చెందారు.

గందరగోళంలో విద్యార్థులు

మండల స్కూళ్లలో విద్యార్థులు చాలా తక్కువ శాతం మంది హాజరయ్యారు. దాదాపు 3,788 మంది విద్యార్థులుండగా, వారిలో సగం కంటే తక్కువగా హాజరయ్యారు. దీంతో విద్యార్థులు పలుచగా ఉండటంతో తరగతి గదులు వెలవెలబోయాయి. కశింకోట బాలికల హైస్కూలులో 500 మంది పైగా విద్యార్థులుండగా, వారిలో 50 మంది వరకు మాత్రమే హాజరయ్యారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో 450 మంది విద్యార్థులుండగా, వారిలో 92 మంది మాత్రమే హాజరయ్యారు. తాళ్లపాలెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 400 మందిపైగా విద్యార్థులుండగా 20 మంది మాత్రమే హాజరయ్యారు. తేగాడ ఆదర్శ పాఠశాల, మిగిలిన పాఠశాలలకు కూడా తక్కువగా విద్యార్థులు హాజరయ్యారు. వెదురుపర్తి హైస్కూలులో 110 మంది పైగా విద్యార్థులుండగా, అక్కడ సగానికి పైగా 65 మంది హాజరు కావడం విశేషం. నూతనంగా పాఠశాలలు పునర్ వ్యవస్థీకరణ వల్ల విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. మొదటి రోజు కావడం వల్ల తరగతి గదులు, పరిసరాలను శుభ్రపరచుకోవడంతోనే విద్యార్థులు ఎక్కువ సమయం గడిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, హెచ్ఎం ఎంవీఆర్ అప్పారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎస్. సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు, కృష్ణరాజు కాలువ నీటి సంఘం మాజీ డైరెక్టర్ మళ్ల లోవకృష్ణ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కశింకోటలోని బాలికల హైస్కూలులో పలుచగా హాజరైన బాలికలు



అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూలులో బుక్స్ సర్దుతున్న విద్యార్థినులు

కోటి మంత్ర జప యజ్ఞం

అనకాపల్లి టౌన్: లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఓం గం గణపతయే నమః కోటి మంత్ర యజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వినాయక సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. వివిధ రాష్ట్రాల్లోని వినాయక భక్తులను కలుపుకుని 7386613333 నంబర్‌తో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామన్నారు. ఆ గ్రూపులో చేరిన వారు ఖాళీ సమయాన్ని బట్టి మంత్రాలను చదివి, ఆ సంఖ్యను వాట్సాప్ గ్రూప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ విధంగా ఇప్పటికి 25 లక్షల మంత్రాలు పూర్తి అయ్యాయన్నారు. ఈ ఏడాది ఉగాది రోజున ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 27వ తేదీన జరిగే వినాయక చవితి పండగకు పూర్తయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం గ్రామం వద్ద కోడి పందేలు ఆడుతున్న వారిపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని సీఐ అల్లు స్వామి నాయుడు గురువారం తెలిపారు. వీరి నుంచి రూ.600, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు సోమవరం, మునగపాక గ్రామాలకు చెందిన చెరో ఇద్దరు ఉన్నారన్నారు.

కనీస జాగ్రత్తలతో మలేరియా అంతం

అనకాపల్లి టౌన్: కనీస జాగ్రత్తలతో మలేరియాను అంతం చేయవచ్చని డిప్యూటీ హెచ్ఈవో బి మంగమ్మ తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దోమలు పెరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలైన మూతలు లేని నీటి ట్యాంకులు, పాడైపోయిన రుబ్బురోలు, రోడ్డు పక్కనున్న ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వై. రజనీ, ఏఎన్ఎం బి. రాజేశ్వరి పాల్గొన్నారు.

నిధులు జమ కాగానే పనులు పూర్తి

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: సాక్షి కథనానికి జిల్లా విద్యా శాఖ అధికారి జి. అప్పారావునాయుడు స్పందించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై 'సమస్యల ఒడి.. సర్కార్ బడి' శీర్షికన గురువారం సాక్షిలో కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఈవో అప్పారావునాయుడు స్పందించి ఈ విషయమై మండల విద్యా శాఖ అధికారులను ఆరా తీశారు. దీనిలో భాగంగా ప్రధానంగా పలు పాఠశాలల్లో ఆగిపోయిన నాడు-నేడు రెండో విడత పనులపై సమగ్ర వివరణ కోరారు. దీంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డీఈవోకు నివేదించారు. కొత్తపల్లి హైస్కూలులో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు తక్కువగా మంజూరు కావడంతో పునాదులతో ఆగిందని, దీన్ని పూర్తి చేయడానికి అయ్యే వ్యయంపై అధికారులకు తెలియజేశామన్నారు. నిధులు జమ కాగానే వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు హెచ్‌ఎం నివేదికలో పేర్కొన్నారు. నరసింగబిల్లి హైస్కూలులో భవనానికి సరిపడిన నిధులు మంజూరు కాగానే రంగులు వేసి పూర్తి చేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. బయ్యవరం హైస్కూలులో మన బడి-మన భవిష్యత్ నిధులు లేనందున బాత్‌రూంలు నిర్మాణ పనులు పూర్తి కాలేదని, నిధులు జమ అయిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. కశింకోట బాలికల హైస్కూలులో మూడు అదనపు తరగతి గదులు పూర్తయ్యాయని, అయితే కిటికీలు, ద్వార బంధాలు, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయని, వీటికి కావలసిన నిధుల కోసం అధికారులకు తెలియజేశామన్నారు. వాటికయ్యే నిధులు జమ కాగానే పూర్తి చేయనున్నట్లు హెచ్‌ఎం నివేదించారని ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు అందించిన నివేదికను డీఈవోకు నివేదిస్తున్నట్లు చెప్పారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా కిలోకి రూ.15 అదనంగా పెరిగింది. గత వారం కిలో రూ.25 ఉండగా, ఈ వారం రూ.40కి పెరిగింది. పచ్చిమిర్చి రూ.60 నుంచి రూ.80కి, అల్లం రూ.60 నుంచి రూ.70కి అదనంగా పెరిగాయి. ఉల్లి రూ.25. బంగాళదుంప, దొండకాయ, బెండకాయ రూ.30, వంకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.60, పెద్ద చిక్కుడు, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ. వందకు విక్రయాలు సాగాయి.

కశింకోట తహసీల్దార్‌గా తిరుమలరావు

కశింకోట: కశింకోట తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌గా సిహెచ్. తిరుమలరావు నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న తహసీల్దార్ జి. సత్యనారాయణ అచ్యుతాపురానికి బదిలీ అయ్యారు. ఇక్కడి రెగ్యులర్ తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు మెడికల్ లీవ్‌లో ఉండటంతో పాయకరావుపేట నుంచి సత్యనారాయణ డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చి బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడి తహసీల్దార్ శ్రీనివాసరావును అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా నియమించారు. ఇక్కడ పని చేసే హెచ్‌డీటీ కె. కుమారస్వామిని అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయానికి, కలెక్టరేట్ ఎ సెక్షన్‌లో పని చేసే రామకృష్ణను ఇక్కడ హెచ్‌డీటీగా నియమించారు. ఇక్కడ పని చేసే ఆర్ఎస్‌డీటీ జి. భాస్కరరావు అనకాపల్లి సీఎస్‌డీటీగా బదిలీ అయ్యారు. అయితే వారు ఇంకా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న బాలికల పాఠశాల హెచ్ఎం రమణ



సత్తెమ్మ కాలనీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న రిటైర్డు ఎంఈవో నంబా రమణ

కశింకోట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు సంప్రదాయంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన ఎనిమిది మంది పిల్లలతో అక్కడి హెచ్ఎం నేమాల రమణ సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. ఓం నమః శివాయః అనే అక్షరాలను పిల్లలతో బియ్యంపై సంప్రదాయంగా చేతితో రాయించి దిద్దించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపీకృష్ణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.సంతోషి, డి. శ్యామల, ఎస్. మహేశ్వరి, స్థానికులు వేగి సాయి, కాండ్రేగుల సతీష్ పాల్గొన్నారు. అదేవిధంగా సత్తెమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో రిటైర్డు ఎంఈవో నంబా రమణ పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు హేమ, కె. తనూజ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: బాల కార్మికులు లేని సమాజం ఏర్పాటు కావాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంలో భాగంగా క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వాలు అమలు చేయడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎంఈవో-2 బుద్ద శివనాయుడు, జనసేన పార్టీ నేత టెక్కలి పరశురామ్, ప్రణతి స్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్, సీఆర్పీ గోవింద పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి

నర్సీపట్నం: వచ్చేనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలు ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ విరమణ, మినీ టీచర్ల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. పేదలకు ఉపయోగ పడే ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఈ సమస్యలపై జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.రమణమ్మ, సిహెచ్.భ్రమరాంబ, మంగ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, కృష్ణవేణి, సామ్రాజ్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



సూదివలసలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శశి ప్రియాంక

కె.కోటపాడు : ప్రస్తుతం వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక సూచించారు. సంచార చికిత్స వైద్య సేవల్లో భాగంగా సూదివలసలో గురువారం ఆమె 137 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విజయ, హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణచేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కె.జె.పురం గ్రంథాలయం తనిఖీ



కె.జె.పురం గ్రంథాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజ్

మాడుగుల రూరల్: గ్రంథాలయాల సమయపాలన పాటించి, పాఠకుల సంఖ్య పెంపునకు కృషి చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజ్ కోరారు.కె.జె.పురం శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారి కోసం పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ అటెండర్ వి.శృతి పాల్గొన్నారు.

'అభయ హస్తం' పింఛన్లు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : వెలుగు పథకం కింద అభయ హస్తం పింఛన్ కోసం డబ్బులు చెల్లించిన 60 ఏళ్ల పైబడిన వారికి పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఆనందపురం గ్రామంలో గురువారం వారాడ, ఆర్.వై.అగ్రహారం, వి.సంతపాలెం, యడ్లవానిపాలెం గ్రామాల్లో సమస్యలపై పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ పథకం ఉందని ఆశతో నగదు కట్టి గ్యాస్ బండ విడిపించుకుంటున్నా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదన్నారు. వారాడ చాకలి వీధిలో వర్షపు నీరు వెళ్లేందుకు అవకాశం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోందన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలపై పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించనున్నామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని నిరసన



సీఐటీయూ నాయకుల నిరసన

అచ్యుతాపురం రూరల్: యోగాంధ్ర కాదు, కార్మికులు, నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. కార్మికులు రోజూ చేస్తున్న వ్యాయామమే ఎక్కువని, వారికి యోగాతో పనిలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి మరింత శ్రమను దోపిడీ చేసే విధంగా చట్టాలు మారుస్తుందన్నారు. పని గంటలు పెరిగి మానసిక ప్రశాంతత లేని వారికి యోగా ఏమి పని చేస్తుందన్నారు. సమస్యలను పక్కదారి పట్టించడానికే సెజ్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.